ఘనంగా అహల్యాబాయి జయంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ బీజేపీ నాయకులు అహల్యాబాయి హోల్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ శంపూర్ విజయేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్ వాసు, గిరిబాబు, విగ్నేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌గుప్తా, మోహన్, అర్జున్, మారుతీ, శ్రీనివాస్, వీరేష్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆవిర్భావ వేడుకలు

దుండిగల్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు పాల్గొని బీఆర్ఎస్, జాతీయ జెండాలను ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం 13వ స్నాతకోత్సవాన్ని మంగళవారం వర్సిటీలోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జేఎన్‌టీయూ వీసీ టి. కిషన్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నారని పేర్కొన్నారు. అదే విధంగా గౌరవ డాక్టరేట్‌ను ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్(ఏఐసీటీఈ) టి.జి సీతారామ్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. జేఎన్‌టీయూహెచ్ నేషనల్ అసైన్‌మెంట్‌లో ఏ+ గ్రేడ్ దక్కిందని, ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో దేశ వ్యాప్తంగా 88వ ర్యాంకు విశ్వ విద్యాలయంకు దక్కిందని తెలిపారు. యూజీ కోర్సులు, పీజీ కోర్సులలో సిలబస్‌ను రూపొందిస్తున్నామని, ఉపాధి, నైపుణ్య అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను సవరిస్తున్నట్లు పేర్కొన్నారు. స్నాతకోత్సవంలో 92,118 డిగ్రీలు, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ 24,174 మందికి బంగారు పతకాలు అందజేయనున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో విశ్వ విద్యాలయం, కళాశాలలకు చెందిన 791 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ సెల్, జేఎన్‌టీయూకు హరితహారం అవార్డు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డులు దక్కాయని పేర్కొన్నారు. సమావేశంలో రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ ముగింపు



బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని భగత్‌సింగ్ పార్కులో 45 రోజుల పాటు ఉచిత కరాటే శిక్షణ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హాజరై శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవులను వృథా చేయకుండా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నారు. కోచ్ దుర్గారావుని సన్మానించారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ కోచ్ ఆనంద్, ప్రవీణ్, మిత్రా, కరాటే అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, సభ్యులు బాబుగౌడ్, బాలచందర్ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. లబ్ధిదారుల పరేషాన్!

కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు

- మూడు నెలల బియ్యం పంపిణీకి మొదటి రోజే కష్టాలు
- ఆరుసార్ల వేలిముద్రతో తీవ్ర జాప్యం
- డీలర్లపై లబ్ధిదారుల ఆగ్రహం
- పలు చోట్ల షాపులు మూసి వేసిన డీలర్లు

ప్రకృతి విపత్తుల దృష్ట్యా ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఆదివారం నుంచి మూడు నెలల బియ్యం పంపిణీని ప్రారంభించింది. మూడు నెలల బియ్యం పంపిణీకి మొదటి రోజే ఇబ్బందులు తప్పలేదు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో డీలర్లు అవస్థలు పడ్డారు. దీనికి తోడు సర్వర్ డౌన్‌తో లబ్ధిదారులు గంటల తరబడి నిలబడ్డారు. అయినా బియ్యం అందకపోవడంతో కార్డు దారులు డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం చెప్పలేక పలుచోట్ల డీలర్లు దుకాణాలను సైతం మూసివేశారు.



బాచుపల్లిలోని రేషన్ దుకాణం వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

నిజాంపేట్: మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో కార్డుదారులు బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచే రేషన్ షాపుల ముందు నిలబడ్డారు. బియ్యం పంపిణీ చేసేందుకు బయోమెట్రిక్ ద్వారా వేలి ముద్రలు తీసుకునే సమయంలో డీలర్లు అనేక ఇబ్బందులు పడ్డారు. దీంతో సమయం ఎక్కువగా తీసుకుంటుండటంతో కార్డు దారులు రేషన్ డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడంతో గంటల తరబడి బియ్యం కోసం కార్డుదారులు ఎండలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్డు దారులకు సమాధానం చెప్పలేక రేషన్ డీలర్లు దుకాణాలను సైతం మూసివేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మొత్తం 141 రేషన్ షాపుల ద్వారా 1,29,013 మంది రేషన్ కార్డుదారులకు జూన్, జూలై, ఆగష్టు నెలలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

మూడు నెలల రేషన్ ఒకే సారి పంపిణీలో సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెల రోజుల ముందు నుంచి మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నామని డీలర్లు, అధికారులు, ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం కార్డుదారులు కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇంతకు ముందు కార్డుదారుల్లో ఒక వేలిముద్ర వేస్తే సరిపోయేది. ప్రస్తుతం లబ్ధిదారుడు ఆరు సార్లు బయోమెట్రిక్‌లో వేలి ముద్ర వేస్తుండటంతో ఎక్కువ సమయం పడుతుంది. దీంతో బియ్యం పంపిణీకి తీవ్ర ఆలస్యమవుతుంది. దీనికితోడు సర్వర్ డౌన్ వస్తే సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇలా ఉదయం నుంచి సాయంత్రం వరకు డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే బియ్యం పంపిణీ చేసేందుకు కృషి చేశారు. అంతే కాకుండా డీలర్ ఒక కార్డుదారుడికి బియ్యం పంపిణీ చేయగానే స్టాక్ రికార్డులో ఇచ్చిన బియ్యం మైనస్ కావాలి. ప్రస్తుతం అలా కాకపోవడంతో డీలర్లకు తలనొప్పిగా మారింది.

అవగాహన లేక అయోమయం

కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకువచ్చినప్పుడు పూర్తి స్థాయిలో డీలర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ అర కొరగా అవగాహన కల్పించడంతో క్షేత్ర స్థాయిలో డీలర్లు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో డీలర్లు దుకాణాలను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది. 40 నిమిషాల నుంచి గంట వ్యవధి ఒక్క కార్డుకు సమయం తీసుకుంటుందంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఒకేసారి బయోమెట్రిక్ విధానం ఉండాలి



మూడు నెలల బియ్యం ఇస్తున్నారు సరే. మరి వేలి ముద్రలు ఆరు సార్లు ఎందుకు తీసుకుంటున్నారు. ఒకే సారి వేలి ముద్ర వేయంగానే బియ్యం ఇచ్చే పద్ధతి అమలు చేయాలి. ప్రభుత్వం, అధికారులు చేసే తప్పులకు డీలర్లు, మేము ఇబ్బందులు పడుతున్నాం. వేలి ముద్ర ఒక్క సారి ఉంటే తక్కువ సమయంలో అందరికీ మేలు జరుగుతుంది.

– మారుతి, బాచుపల్లి.

పొద్దుగాల నుంచి నిలబడ్డా



మూడు నెలల బియ్యం ఒకే సారి ఇస్తున్నారని తెలిసి పొద్దుగాల నుంచి ఉన్న. మూడు గంటలైనా బియ్యం తీసుకోలేదు. మిషన్ పని చేయడం లేదని షాపు మూసివేశారు. నాకు షుగర్ ఉంది. ఏమైన జరిగితే బాధ్యులెవరు?. అన్ని చూసుకున్న తరువాతనే బియ్యం ఇయ్యాలే కదా?. కొత్త పద్ధతి పెట్టేమందు జాగ్రత్తగా చేయాలి.

– రోజా, దూలపల్లి

కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు



మూడు నెలల బియ్యం కోసం కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఆరు సార్లు ప్రతి కార్డు దారుడు వేలిముద్ర వేయాలి. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీనికి తోడు సర్వర్ డౌన్‌తో తాము ఏమీ చేయలేని పరిస్థితి. ఈ విషయాలు అన్ని తెలియక కార్డుదారులు మాపై కోపడి వాగ్వాదానికి దిగుతున్నారు. ఇబ్బందులను తట్టుకోలేక కొన్నిచోట్ల షాపులు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– శ్రీహరి, అధ్యక్షుడు,మండల లెవీ స్టాక్ పాయింట్.

డ్రంకన్ డ్రైవ్‌లో 71 మందిపై కేసు

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ ట్రాఫిక్ సీపీ పరిధిలో శనివారం స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 30 మంది, జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 20 మంది, అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 21 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు చలాన్లు విధించారు.

గురుకులాల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు

నిజాంపేట్: దళిత విద్యార్థులు బాత్‌రూములు కడుక్కోవాలని వ్యాఖ్యలు చేసిన గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణీని వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో వేల సంవత్సరాల నుంచి అన్ని రకాల అవమానాలను భరిస్తున్న దళిత విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదిగే తరుణంలో ఐఏఎస్ అధికారి అలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉత్తమ ఫైర్‌స్టేషన్ అధికారిగా శేఖర్‌రెడ్డి



శేఖర్‌రెడ్డి

జీడిమెట్ల: జీడిమెట్ల ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి ఉత్తమ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఆదివారం డైరెక్టర్ జనరల్ తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ హైదరాబాద్ వారు ప్రకటించిన లిస్ట్‌లో జీడిమెట్ల ఆఫీసర్ పేరును ప్రకటించారు. ఉత్తమ ఉద్యోగిగా శేఖర్‌రెడ్డి ఎంపికవ్వడం పట్ల జీడిమెట్ల ఫైర్ స్టేషన్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతా



- బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం బహదూర్‌పల్లిలోని ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరాలో పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు తదితర సమస్యలను కాలనీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. కొంపల్లి నుంచి గచ్చిబౌలి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ డైరెక్టర్లు విజయ భాస్కర్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, హనుమ సతీష్, అసోసియేషన్ సభ్యులు అడ్వకేట్ రవి కుమార్‌రెడ్డి, శివ కుమార్, రవితేజ, మద్దిపట్ల సాయికిరణ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

- గాజులరామారం డివిజన్ ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. కాలనీ అభివృద్ధి విషయంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాగర్ రావు, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, సలహాదారులు దయాకర్ రెడ్డి, ఎస్.వి.ఎన్ చారి, ఉపాధ్యక్షుడు భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ శంకర్, సంయుక్త కార్యదర్శి శ్రీపాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

- సూరారం డివిజన్ లక్ష్మీనగర్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్డు వసతులను కల్పించాలని వారాల శేషు, మురళీకృష్ణ, ధర్మరాజు, గణేష్, రాంశివ విన్నవించారు.
- సూరారం డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు శివాగుప్తా, ప్రధాన కార్యదర్శి జగదీప్‌సింగ్, కోశాధికారి అభిలాష్‌లు కోరారు. వాటిపై స్పందించిన వివేకానంద్ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన విశ్వనాథ్ కార్తికేయకి సన్మానం



పడకంటి విశ్వనాథ్ కార్తికేయని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

కుత్బుల్లాపూర్: అత్యంత పిన్న వయస్సులోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి భారతీయుడిగా రికార్డ్ సృష్టించిన పడకంటి విశ్వనాథ్ కార్తికేయని ఆదివారం వాసవి క్లబ్ సుచిత్ర సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు మాశెట్టి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వనాథ్‌కు ప్రశంస పత్రాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు తోట భిక్షపతి, సభ్యులు ఉప్పల రమేష్, పల్లా నాగరాజు, ఉప్పల నాగరాజు, పడకంటి వెంకటేశం, కాసం నాగేశ్వర్, వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు

ఉచిత ఐ క్యాంప్ అభినందనీయం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీఐ ఉపేందర్ తదితరులు

నిజాంపేట్: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఐ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని బాచుపల్లి సీఐ ఉపేందర్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ బండారి లే అవుట్‌లోని రాజధాని స్కూల్‌లో ఉచిత మెగా కంటి పరీక్షల శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి ఒక్కరికి కండ్లు చాలా ముఖ్యమైనవని అన్నారు. మొబైల్ వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ భిక్షపతి యాదవ్, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు దాసి నాగరాజు, ఎల్‌జీఎఫ్ కో ఫౌండర్ కోమల భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేయాలి

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వచ్చిన తల్లి, బిడ్డ చనిపోవడం బాధాకరమని, బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారాన్ని అందజేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

బాలానగర్: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్, జ్యూట్ బ్యాగులు వాడాలని పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. ఆదివారం బాలానగర్‌లోని ఫ్రూట్ మార్కెట్‌లో ప్లాస్టిక్ సంచుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ కవర్లకు బదులుగా క్లాత్ సంచులు వాడాలని సంచులను పలువురికి ఉచితంగా అందజేశారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం



చింతల నాగరాజును సన్మానిస్తున్న పరిశ్రమ కార్మికులు

కుత్బుల్లాపూర్: కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ఎంత వరకైనా పోరాడుతానని కార్మిక నేత, సాయినార్ లాబోరేటరీస్ యూనియన్ అధ్యక్షుడు చింతల నాగరాజు అన్నారు. ఆదివారం చింతల్ వాణినగర్‌లోని ఆయన నివాసంలో కంపెనీ కార్మికులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన అగ్రిమెంట్‌లో రూ.16వేల వేతనం ఇచ్చేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందని, అదే విధంగా ఇతర అలవెన్సులు, దుస్తులు, ఇచ్చేలా ఒప్పందం జరిగిందన్నారు. కార్మికులు సైతం బాధ్యతాయుతంగా పనిచేస్తూ పరిశ్రమ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలన్నారు.

వ్యర్థాలకు ఆగని ! నిప్పు



ఐడీఏ గాంధీనగర్‌ను ఆనుకుని ఉన్న ఐడీపీఎల్ ఖాళీ స్థలంలో చెత్తను కాల్చివేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: పారిశ్రామిక వాడల్లో చెత్తను తరలింపుపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పారిశుద్ధ్య సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రోజువారీ చెత్తను తరలించాల్సి ఉండగా.. సంబంధిత కాంట్రాక్టర్లు ఆధ్వర్యంలో పనిచేసే సిబ్బంది ఎక్కడి చెత్తను అక్కడే పోగేసి నిప్పు పెడుతున్నారు. అదే విధంగా విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించగా.. వాటిని తరలించకుండా తాత్సర్యం చేస్తున్నారు. అవి ఎండిన తరువాత వాటికి నిప్పు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆదివారం ఐడీఏ గాంధీనగర్ పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న ఐడీపీఎల్ ఖాళీ ప్రదేశంలో చెత్తకు నిప్పు పెట్టడంతో పొగలు వ్యాపించాయి. అదే విధంగా వెంకట్రామిరెడ్డినగర్‌కు వెళ్లే దారిలో నరికివేసిన చెట్ల కొమ్మలకు నిప్పు పెట్టారు.

సంక్షేమ సంఘాలు భాగస్వాములవ్వాలి

- ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

రంగారెడ్డినగర్: అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం ఎంపీని కలిశారు. రోడ్లు, పార్కు, కమ్యూనిటీ భవనం నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44లోని రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి వివిధ కాలనీలకు వచ్చే రోడ్డు అభివృద్ధి విషయంపై చర్చించారు. సీఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టాల్సి ఉండగా.. హెచ్ఎండీఏ అధికారులు అడ్డుకుంటున్న విషయంపై ఆరా తీశారు. దీనిపై స్పందించిన ఎంపీ త్వరలోనే ఆ రోడ్డుకు మోక్షం కలిగేలా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎంపీఆర్ చంద్రశేఖర్, కోశాధికారి రాకేష్, ఆర్గనైజర్ శివకుమార్ పాండే, కమిటీ సభ్యులు సత్య, సందీప్ రెడ్డి, శేఖర్, భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.